సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 72 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం | 03.07.2025



## ఇసుక అక్రమ రవాణాపై చర్యలు

- ఆన్‌లైన్ జీరో పర్మిట్ విధానం పక్కాగా అమలు చేయాలి
- టీజీఎండీసీ ద్వారానే ఇసుక కొనుగోలు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

2లో



wanted

విలేకరులు కావలెను



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

## ‘ఉగ్రా’ క్రమంలో భద్రకాళిమాత

**వరంగల్, మన చౌరాస్తా :**

కాకతీయుల రాజధాని ఏకశిలానగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో పరమపావనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవాలు బుధవారం నాటికి ఏడో రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యాహ్నికం పూర్తిచేసిన తర్వాత అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి ‘ఉగ్రా మాత’ నిత్యా గాను షోడశీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని ‘శివదూతీమాత’గా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో పూజారాధనలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో కె శేషు భారతి, ఆలయ సిబ్బంది, ధర్మకర్తల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.



# అంగన్‌వాడీలను పరిశీలించిన ఆర్‌జేడీ



**జనగామ , మన చౌరాస్తా :** మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ మోహితి బుధవారం జనగామ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా జనగామ పట్టణంలోని అంబేద్కర్ నగర్, రఘునాథపల్లి మండలంలో ఉన్న మూడు ఆంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులు, తక్కువ బరువు ఉన్న చిన్నారులను స్వయంగా తూకం వేసి పరిశీలించారు. కేంద్రాల్లో అందిస్తున్న ఆహార నాణ్యతను తనిఖీ చేసి, తల్లులతో ప్రత్యక్షంగా మాట్లాడి పౌష్టికాహారం, సౌకర్యాలపై వివరాలను సేకరించారు. ప్రీ-ప్రైమరీ విద్యా కార్యక్రమాల అమలును కూడా సమీక్షించారు. జనగామలో ఉన్న బాలికల వసతి గృహం (బాలసదనం)ను సందర్శించి, అక్కడి వంటగదిని, ఆహార భద్రతా చర్యలను, పరిశుభ్రత, స్వచ్ఛత, భద్రతా ఏర్పాట్లను విశితంగా పరిశీలించారు. బాలసదనం లోని పిల్లలతో ముచ్చటించారు. తరువాత మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బందికి తగు సలహాలు, సూచనలు అందించారు. ఈ సమీక్షలో జిల్లా స్థాయి సిబ్బంది, డీసీపీయూ, చైల్డ్ హెల్ప్ లైన్, సఖి సెంటర్, పోషణ అభియాన్, డీహెచ్ఈడబ్ల్యూ, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.





# ఇసుక అక్రమ రవాణాపై చర్యలు

- **ఆన్‌లైన్ జీరో పర్మిట్ విధానం పక్కాగా అమలు చేయాలి**
- **టీజీఎండీసీ ద్వారానే ఇసుక కొనుగోలు**
- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో ఆన్‌లైన్ జీరో పర్మిట్ సిస్టమ్‌ని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఇసుక, కంకర, తదితర ఖనిజ వనరులకు సంబంధించి ఆన్‌లైన్ జీరో పర్మిట్ సిస్టం, టీజీ ఎండీసీ ద్వారా ఇసుక అనుమతులు తీసుకునే విధానంపై మైనింగ్, టీజీ ఎండిసి, ఇరిగేషన్ పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా పైన ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. వివిధ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి చిన్న తరహా ఖనిజాలైన కంకర, మట్టి, ఇసుక కోసం ఆన్‌లైన్ జీరో పర్మిట్ విధానం ద్వారా అనుమతులు తీసుకునే విధంగా కాంట్రాక్టర్లకు అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆన్‌లైన్ జీరో పర్మిట్‌ను అధికారులు తప్పకుండా అమలు చేయాలని, ప్రభుత్వ పనులను చేపట్టిన కాంట్రాక్టర్లు ఆన్‌లైన్ జీరో పర్మిట్ కు దరఖాస్తు చేసినట్లయితే వెంటనే ఇంజనీరింగ్ శాఖల అధికారులు ఆమోదించాలన్నారు. వివిధ నిర్మాణాలకు ఇంజనీరింగ్ శాఖలకు ఎంత మేరకు ఇసుక అవసరం అవుతుందో వివరాలను విధిగా టీజీ ఎండిసికి సమర్పించాలన్నారు. ఎక్కడ కూడా ఇష్టారీతిన ఇసుకను, చిన్న తరహా ఖనిజాలు తీయకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఇసుక విధానం, అనుమతులు ఉండాలన్నారు. వర్షకాలం ప్రారంభం అయినందున ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రహదారుల రిపేర్లు ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మైనింగ్ శాఖ ఏడీ విజయ్ కుమార్, వివిధ ఇంజనీరింగ్ విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# క్లాస్ల నిర్వహణ పటిష్టంగా ఉండాలి

## అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

**నర్మెట, మన చౌరాస్తా :** నర్మెట్ట మండల కేంద్రం లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ బుధవారం సందర్శించి ఇంటర్ అడ్మిషన్లను , నమోదును అడిగి తెలుసుకున్నారు. మెనూ నిర్వహణ, స్నాక్స్ పరిశీలించిన అనంతరం, స్టోర్ రూమ్ ను సందర్శించి , వస్తు సామగ్రి పరిశీలించారు. అలాగే కొత్తగా ఏర్పాటు చేసిన వాటర్ హీటర్ వినియోగాన్ని పరిశీలించారు. కొత్తగా చేరిన విద్యార్థులతో మాట్లాడి కె.జి.బి.వి.పై అవగాహన కల్పించారు. మెరుగైన వసతులపై ప్రేరణ ఇచ్చి నిర్వహణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేజీబీవీ నిర్వహణ పటిష్టంగా చేపట్టాలన్నారు. భోజనం నాణ్యతగా ఉండాలని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది అందుబాటులో ఉండాలని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి గౌసియా బేగం, ఎం.ఈ.ఓ.ఐలయ్య, ఎంపీడీవో అరవింద్ చౌదరి, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి రజిత, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.





# గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు సరఫరా చేయండి

**జనగామ, మన చౌరాస్తా :** గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు సరఫరా చేయాలని గొర్రెల, మేకల పెంపకందారుల జిల్లా అధ్యక్షుడు మోటే దేవేందర్ కోరారు. ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ ఏడీ దేవేందర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొల్లకురుమల గొర్రెల, మేకలకు నట్టల మందులు, వ్యాక్సిన్ల కోసం అని బడ్జెట్ లో కోట్లలో కాగితాలపైన లెక్కలు చూపిస్తున్న ప్రభుత్వం గ్రామీణ పశువైద్య శాలలో కనీసం చిరంజీవి లు, నిండిల్ కూడ గతికి లేవు డాక్టర్స్ సొంత డబ్బులు పెట్టి రోజు వారిగా కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు కావస్తున్న పశుసంవర్ధక శాఖలో ఒక్కసారైన ముఖ్యమంత్రి సమీక్షలు చేపట్టిన పరిస్థితి లేదన్నారు. అసలే వర్షకాలం మొదలై రెండు నెలలకు వస్తున్న ఇప్పటికీ నట్టల మందులు సరఫరా చేయకపోవడం వలన గొర్రెల కాపరులపైన ఎంత భారం పడుతుందన్నారు. కార్యక్రమంలో జనగామ టౌన్ అధ్యక్షుడు ఉలిగిల్ల చంద్రయ్య, కార్యదర్శి మోటే నరేందర్, ఉపాధ్యక్షుడు దావర భాస్కర్ పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ తోటల సాగును పెంచాలి

**రైతులకు ఖర్చు తగ్గించే పంట ఇది**

**పంట మార్పిడి రైతులకు అధిక ఆదాయాన్ని ఇస్తుంది**

**జనగామ, మన చౌరాస్తా :** రైతులకు అధిక ఆదాయాన్ని చేకూర్చే ఆయిల్ ఫామ్ సాగును పెంచాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్లో ఆయిల్ ఫామ్ విస్తీర్ణం పెంపుపై ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో సంబంధిత ఉద్యానవన వ్యవసాయ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 3,500 ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగుకు అవకాశం ఉందని తెలియజేశారు. ముందుగా గుర్తించిన 700 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే 2800 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు చేసేందుకు ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా లక్ష్యాలు రూపొందించుకొని ఫలితాలు సాధించాలన్నారు. పంట మార్పిడి విధానం రైతులకు లాభం చేకూరుస్తుందని రైతులకు తెలియజేయాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొరత సృష్టించకుండా ఫెస్టిలైజర్స్ షాపులను నిరంతరం తనిఖీ చేయాలన్నారు. ఎరువుల ధరలను, పట్టిక ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. స్టాక్ ను పరిశీలించాలన్నారు. రిజిస్టర్లను పరిశీలించి, రైతు వివరాలను సెల్ నెంబర్ తో సహా నమోదు చేయించాలన్నారు. ఫెర్టిలైజర్స్ తనిఖీ చేసిన ఫొటోలను వాట్సాప్ గ్రూప్ లో పంపించాలన్నారు. రైతులకు పంట దిగుబడితో అధిక లాభాలను చేకూర్చే ఆయిల్ ఫామ్ తోటల విస్తీర్ణం పెంచాలని, నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఆయిల్ ఫామ్ తోటల సాగు పై సందేహాలను నివృత్తి పరిచేందుకు రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగుతో రాణిస్తున్న రైతులతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. భూగర్భ జలాలను పరిరక్షించేందుకుగాను జిల్లాలోని ప్రతి రైతు వేదికలో సోకు పిట్ తప్పనిసరిగా నిర్మించాలన్నారు. పెండింగ్ కేవైసీ పూర్తి చేయాలని, ఆధార్ అప్డేట్ కూడా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి శ్రీధర్, వ్యవసాయ శాఖ అధికారి రామారావు నాయక్, సహకార శాఖ అధికారి రాజేందర్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ జిల్లా మేనేజర్ శంకర్, వ్యవసాయ శాఖ ఏడీలు, ఏవోలు, ఏఈఓ లు, ఆయిల్ ఫెడ్ క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.







# గుంతల రోడ్లపై హెచ్చరిక బోర్డులు

## – వినూత్నంగా నిరసన తెలపిన అమ్మ ఫౌండేషన్

**జనగామ, మన చౌరాస్తా : జనగామ పట్టణంలో పలు రహదారులు, కాలనీల రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చాలని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయా గుంతల వద్ద హెచ్చకరి బోర్డులు ఏర్పాటు చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. జనగామ మున్సిపల్ కమిషనర్ స్పందించి ఒకసారి జనగామ పట్టణం పర్యటించి గుంతలుగా ఉన్న రోడ్లను వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కీర్తి నరసయ్య, కాసుల శ్రీనివాస్, రాజేష్, ఇల్లందుల ప్రవీణ్, పండుగ నరేష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.**










## ప్రభుత్వ పాఠశాలల్లోనే

# నాణ్యమైన విద్య


- **మెనూ తప్పక పాటించాలి**
- **విద్యార్థులకు కెరీర్ కౌన్సిలింగ్ ఇవ్వండి**
- **కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**జనగామ, మన చౌరాస్తా :** ప్రభుత్వ పాఠశాలలోనే ఉన్నతమైన విద్య, పౌష్టికాహారం అందుతుందని, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. బుధవారం ఓబుల్ కేశవ పుర్ లోని జడ్పీ హైస్కూల్ ని కలెక్టర్ సందర్శించి 9,10వ తరగతిలో విద్యార్థుల సామర్థ్యాలను, డిజిటల్ బోధన తీరును, పిల్లలకు ఏం వండి పెట్టారు అని మధ్యాహ్నం భోజన గురించి, అంగన్వాడీలో ఉన్న చిన్నారులను, ప్రి ప్రైమరీ క్లాసును సందర్శించి అందులోని విద్యార్థుల ప్రతిభను కలెక్టర్ స్వయంగా తెలుసుకున్నారు. ముందుగా 9వ తరగతిలోకి వెళ్లిన కలెక్టర్ యూనిఫార్మ్స్, నోట్ బుక్స్ అందరికి వచ్చాయా అని అడిగగా.. అందరికి వచ్చాయని విద్యార్థులు సమాధానం ఇచ్చారు. వచ్చే సంవత్సరం 10వ తరగతి లోకి వెళ్తారు కాబట్టే ఇప్పటి నుంచే అన్ని సబ్జెక్టులో మంచి మార్కులు వచ్చేలా చదవాలని విద్యార్థులకు సూచించారు. ఆ తర్వాత పదో తరగతి క్లాస్ లోకి కలెక్టర్ వెళ్లి డిజిటల్ బోధన తీరును దగ్గరుండి పరిశీలించి, దాని అవ్యశకతను విద్యార్థులకు తెలియజేశారు. గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో జిల్లాకు మూడో స్థానం లభించిందని, ఈ సారి మొదటి స్థానం వచ్చేలా విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఏవైనా కష్టమైన సబ్జెక్టులు ఉంటే ఇప్పటి నుంచే వాటి మీద పట్టు సాధించేలా నిరంతరం ప్రాక్టీస్ చేయాలన్నారు. ఈ రోజు ఏం భోజనం పెట్టారు. మెనూ పాటించారా లేదా అనే విద్యార్థులను, ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మెనూలో ఉన్నది కాకుండా పిల్లలకు వేరేది వండి పెడితే కఠిన చర్యలు తప్పమన్నారు. అనంతరం అంగన్వాడి పాఠశాలలోకి వెళ్లి చిన్నారులు ఎంతమంది ఉన్నారు, వాళ్ళ బరువు ఎత్తు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారా లేదా అడిగారు. చివరగా ప్రీ ప్రైమరీ తరగతిలోకి వెళ్లి కూడికలు, తీసివేతలను పిల్లలు ఎలా చేయగలరు అని కలెక్టర్ తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈవో భోజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# విశ్వంభర గ్రాఫిక్స్ హాలివుడ్‌కు..

తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియన్ మూవీలలో 'విశ్వంభర' ఒకటి. అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తుండగా.. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ పనుల్లో బిజీగా గడుపుతుంది. సినిమా టీజర్‌పై విపరీతంగా ట్రోల్స్ రావడంతో గ్రాఫిక్స్‌పై మరింత కష్టపడుతున్నారు మేకర్స్. అయితే ఈ సినిమా గ్రాఫిక్స్‌కి సంబంధించి తాజాగా ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ సినిమా గ్రాఫిక్స్ పనులను హాలీవుడ్‌కి చెందిన వీఎఫ్ఎక్స్ స్టూడియోకి అప్పగించినట్లు తెలుస్తుంది. ఈ హాలీవుడ్ స్టూడియో విశ్వంభర సినిమాకు సాలిడ్ అవుట్ పుట్‌ని అందించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ పనులు కంప్లీట్ అయిన అనంతరం సినిమా విడుదల తేదీని మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నట్లు సమాచారం. మరోవైపు అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరు ఒక సినిమా చేస్తున్నాడు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతుంది. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తున్నారు.







నటనను వదిలేశానంటూ

# రూమర్లు

## అలాంటిదేమీ లేదన్న నటి కోమలి ప్రసాద్

తెలుగు చిత్రసీమలో తనదైన ముద్ర వేసుకుని నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది కోమలి ప్రసాద్. ఇటీవల నాని 'హిట్ 3' మూవీలో ముఖ్యపాత్ర పోషించిన ఈ ముద్దుగుమ్మ, త్వరలో 'శశివదనే' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అయితే ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ఆమె గురించి కొన్ని అబద్ధపు పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి. నటనకు గుడ్ బై చెబుతూ డాక్టర్ వృత్తిలోకి మారిపోయింది అని పుకార్లు వినిపించడంతో, కోమలి తానే స్వయంగా స్పందించారు.. 'అందరికీ నమస్కారం. ఇటీవల నా గురించి డాక్టర్‌గా మారిపోయానని, నటనను పూర్తిగా వదిలేశానని కొన్ని అసత్య వార్తలు ప్రచారంలో ఉన్నాయి. కొందరు ప్రముఖ మీడియా సంస్థలు కూడా దీనిని నిజమైందన్నట్లుగా ప్రచారం చేయడం బాధాకరం. ఇది పూర్తిగా అసత్యం. నిజానికి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ సినిమాల్లో నా స్థానం సంపాదించుకున్నాను. ఆ శివుని ఆశీస్సులతో నా నటనా ప్రస్థానం కొనసాగుతోంది. ఈ రకమైన రూమర్లు నాలోను, నా శ్రేయోభిలాషుల్లోను అనవసరంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి తప్పుడు వార్తలు వ్యాప్తి చెందకూడదని మనస్ఫూర్తి వేడుకుంటున్నాను. అందుకే ఈ పోస్ట్ ద్వారా నిజాన్ని మీ అందరితో పంచుకోవాలనుకున్నాను. నటన నాకు ఒక్క ఉద్యోగం మాత్రమే కాదు.. అది నా జీవన విధానం. చివరి శ్వాస వరకు నేను నటనతోనే జీవించాలనుకుంటున్నాను. ప్రస్తుతం కొత్త స్క్రిప్ట్‌లను ఎంతో జాగ్రత్తగా ఎంపిక చేసుకుంటున్నాను. త్వరలోనే మీ అందరినీ గర్వపడేలా చేసే కొత్త ప్రాజెక్ట్‌ల వివరాలతో మీ ముందుకు వస్తాను. నా ప్రయాణంలో వెన్నెముకలా నిలిచిన నా శ్రేయోభిలాషులకు, నన్ను నమ్మిన ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని కోమలి ప్రసాద్ తేల్చిచెప్పింది.